సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 20 । జూలై । 2023



గంగమ్మ జాతరకు సర్వం సిద్ధం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధి గాంచిన బలిజపల్లె గంగమ్మ జాతరకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. -8లో



నాటుసారాపై ఎస్ఈబీ దాడులు

మదనపల్లె, కురబలకోట మండలాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎస్ఈబీ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1200	రూ.1280
రెండోరకం	రూ.960	రూ.1200

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 596 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	400
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 44.82 కిలోలు

న్యూస్‌రీల్

ఆర్‌బీకేలను తనిఖీ చేసిన వ్యవసాయాధికారి



మోటకట్ల ఆర్‌బీకేను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

సంబేపల్లె: మండల పరిధిలోని నారాయణరెడ్డి, మోటకట్ల గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలను అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పంటలు సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



మందలవారిపల్లె వద్ద 104 సేవలను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

పెద్దమండ్యం: గ్రామాలలో 104 ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కొండయ్య అన్నారు. మండలంలోని మందలవారిపల్లెలో 104 ద్వారా రోగులకు అందుతున్న సేవలను బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో మిషన్ ఇంద్రధనుష్‌పై సమీక్షించారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీడీఎన్‌సీడీ పర్యవేక్షణ అధికారి విష్ణువర్ధన్, ఇమ్యునైజేషన్ సూపర్‌వైజర్ నారాయణ, డాక్టర్ ఇమ్మానుయేల్, సీహెచ్‌ఓ కృష్ణయ్య, హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అలక వీడని చినుకు

- జిల్లాలో అత్యధిక మండలాల్లో అతి తక్కువ వర్షాలు
- జూన్‌లో నందలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లెల్లో కురవని వాన
- మదనపల్లెలో ఒక మి.మీ వర్షం
- ఆరు మండలాల్లో 10 మి.మీలోపు వర్షపాతం
- కమ్ముకొంటున్న కరువు ఛాయలు



బి.కొత్తకోట: ప్రస్తుత ఖరీఫ్ రైతులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. గత ఖరీఫ్ కంటే దారుణమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. పంటలు సాగు చేసేందుకు రైతాంగం సిద్ధంగా ఉండగా వర్షాలు ముఖం చాటేశాయి. ఈ ఖరీఫ్‌లో జూన్, జూలైలో కురిసిన వర్షపాతం పరిశీలిస్తే ముందు ఆందోళనకర పరిస్థితులు తప్పవన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో జూన్ నెలలో 30 మండలాల్లో 2,713.5 మిల్లీమీటర్ల వర్షం కురవాలి. అయితే 868.6 మిల్లీమీటర్ల వర్షమే కురిసింది. జిల్లా సాధారణ వర్షపాతం 90.5 మిల్లీమీటర్లు కాగా కురిసింది కేవలం 29 మిల్లీమీటర్లే. జూలైలో అన్ని మండలాల్లో 2,252.8 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,180.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా సాధారణం 75.1 మిల్లీమీటర్లుకాగా కురిసింది 39.4 మిల్లీమీటర్ల వర్షమే. దీంతో జిల్లా వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఆ రెండు మండలాలే అత్యధికం

జిల్లాలో 30 మండలాలుండగా కేవలం రెండు మండలాల్లో మాత్రమే సాధారణానికి మించి అత్యధిక వర్షపాతం నమోదైంది. జూన్‌లో ములకలచెరువులో 55.7 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి మించి 121.8 మిల్లీమీటర్లు, తంబళ్లపల్లెలో 78.6 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి మించి 117.2 మిల్లీమీటర్ల వర్షపా తం నమోదైంది. ఇదేనెలలో సంబేపల్లె, కలికిరి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా, నంద లూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాల్లో చినుకు పడలేదు. విచిత్రంగా మదనపల్లెలో ఒక మిల్లీమీటరు వర్షపాతం నమో దైంది. టి.సుండపల్లె,చిట్వేలి, రామాపురంలో పది మిల్లీమీటర్లలోపు వర్షం కురిసింది. జూలైలో కలకడ, చిన్నమండెం, ఓబులవారిపల్లె మండలాల్లో పది మిల్లీమీటర్లలోపు వర్షం కురిసింది. మిగతా మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

పంటల సాగు లేనట్టే

ఈనెలలో వర్షాలు లేకపోవడంతో ఖరీఫ్ రైతులు పంటల సాగుకు దూరమవుతున్నారు. విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుని పంట విత్తేందుకు సిద్ధంగా ఉన్నప్పటికి వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు సాగు చేసేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. దీంతో జిల్లాలో గత ఖరీఫ్ కంటే దారుణంగా సాగు పడిపోయేలా కనిపిస్తోంది. వర్షాలు లేకుంటే ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసేందుకు సిద్ధం కావాల్సిందే.

30 మండలాల్లో తీవ్ర వర్షాభావం

జూన్‌లో రెండు మండలాల్లో సాధారణం, రెండు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదవగా, మిగిలిన 26 మండలాల్లో లోటు వర్షపాతమే. చాలా మండలాల్లో అతితక్కువ వర్షపాతం నమోదైంది. అత్యధిక మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. జూన్ దాటాక పరిస్థితుల్లో మార్పు వస్తుంది, వర్షాలు కురుస్తాయని ఆశలు పెట్టుకున్నప్పటికి నిరాశ మిగులుతోంది. జూలై మూడోవారం ముగుస్తున్నా వర్షాలు లేకపోవడం ఆందోళనకరం. జూలైలో ఇలాంటి వర్షాభావ పరిస్థితి గతంలో లేదు. ఈనెలలో ఖరీఫ్ పంటలన్నీ సాగు పూర్తి చేసుకోవాల్సింది. వర్షాభావంతో పంటల సాగు ఆగిపోయింది. జిల్లాలోని 30 మండలాల్లోనూ వర్షం లేదు. ఒక్క మండలంలోనూ సాధారణ వర్షపాతం కురవలేదు.

శ్రమించే తత్వంతో ఉన్నతశిఖరాలు

వైవీయూ: క్రమశిక్షణ, నిరంతరం శ్రమించే తత్వం విద్యార్థులను అత్యున్నత స్థానానికి చేర్చుతుందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం వైవీయూలోని గురుకులం భవనాల్లో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ హాజరై మాట్లాడారు. విశ్వవిద్యాలయంలోకి ప్రవేశించే విద్యార్థులు ఒక ఉన్నతమైన ఆశయంతో ఇక్కడ ప్రవేశం పొంది ఉంటారని, ఆ లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. క్రమశిక్షణతో మెలగాలని, సమయపాలన పాటించాలని సూచించారు. ఇక్కడ లభించే వనరులను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

బడిఈడు పిల్లల నమోదుపై శ్రద్ధ చూపాలి

కలెక్టర్ గిరీషా పీఎస్



రాయచోటిలోని ప్రైవేటు స్కూల్ తనిఖీలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: బడిఈడు పిల్లల నమోదుపై ప్రత్యేక శ్రద్ధపెట్టి త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పలు విద్యాసంస్థల యాజమాన్యాలను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని పలు విద్యా సంస్థల్లో చైల్డ్ ఇన్ఫో అడ్మిషన్ ప్రోగ్రాం పనితీరును పరిశీలించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి కళాశాలలో చైల్డ్ ఇన్ఫో అడ్మిషన్ పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అడ్మిషన్ రిజిస్టర్‌లు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ ప్రసాద్, ఎంఈఓ బాలాజీ నాయక్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం: విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ నమోదు వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని కుమ్మరపల్లె జెడ్పీ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి పెండింగ్ ఉండటంపై సరైన కారణాలు చెప్పలేకపోవడంతో అధికారులు, సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. డిప్యూటీఈఓ ప్రసాద్ బాబు, జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లంకమల అభయారణ్యంలో కూంబింగ్



కూంబింగ్ నిర్వహిస్తున్న రేంజర్, సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజిలోని లంకమల అభయారణ్యంలో కూంబింగ్ నిర్వహించామని సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్దవటం, రోళ్ళబోడు బీట్లలోని సమస్యాత్మక ప్రదేశాలైన పాతాళబండ, సవర్లబావి, ఉలవకట్ట లోయ, ముట్టిక్కుడు, చెంచలచెలిమి, పెంటబావి, ఆముదా గొంది రస్తా వంటి ప్రదేశాల్లో రెండు రోజులుగా అటవీ శాఖ సిబ్బందితో కలిసి ఆమె కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు లంకమల అభయారణ్యంలో ముమ్మరంగా కూంబింగ్ నిర్వహించామన్నారు. ఎక్కడా ఏ విధమైన స్మగ్లింగ్ ఆనవాళ్లు కనిపించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, ఫారెస్టు బీటు అధికారులు రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, బంగ్లాబావి, సాహెబ్ బావి బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న ఇల్లు కూల్చివేత



ఇంటి గోడలు కూల్చివేసిన దృశ్యం

పీలేరు రూరల్ : నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిని గుర్తు తెలియని దుండగులు కూల్చివేసిన సంఘటన మండలంలోని ఆటో నగర్‌లో చోటు చేసుకుంది. బాధితుని ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. బిస్మిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు బోదేషావల్లి కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ఆటో నగర్‌లో ఇంటిని నిర్మించుకుంటున్నాడు. గోడల నిర్మాణం పూర్తి కావచ్చింది. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు జేసీబీతో గోడలను, ఆటోనగర్‌కు ఏర్పాటు చేసిన శిలాఫలకం ధ్వంసం చేశారు. జరిగిన సంఘటనపై బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణ

కురబలకోట : మండలంలోని ముదివేడు పంచాయతీ ఎరపవారిపల్లెకు చెందిన ఇరు వర్గాల వారు భూ తగాదాలతో బుధవారం పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో ఒక వర్గానికి చెందిన చందు (26), జ్యోతి (20), రామక్రిష్ణ (52), డి. జయమ్మ (45), మరో వర్గానికి చెందిన శంకర్ (25), సురేష్ (50) గాయపడ్డారు. వీరు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముబీన్ తాజ్ తెలిపారు.

గంగమ్మ జాతరకు సర్వం సిద్ధం

- పట్టణంలో కోలాహల వాతావరణం
- బంధువుల రాకతో కళకళలాడుతున్న ఇళ్లు

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధి గాంచిన బలిజపల్లె గంగమ్మ జాతరకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. గురువారం జరిగే జాతరకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు అధికారుల సూచనల మేరకు నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఇదిలా వుంటే ప్రతి ఏటా దాదాపు లక్ష మందికి పైగా పాల్గొంటారు. అయితే గత ఆదివారం జరిగిన జాతర అంకురార్పణ కార్యక్రమంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా భక్తులు పాల్గొన్నారు. అందువల్ల గతంలో కంటే ఎక్కువ మంది పాల్గొనే అవకాశం ఉంటుందని ఇటు పోలీసు అధికారులు, అటు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. పట్టణంలో ఎటుచూసినా కోలాహల వాతావరణం కనిపిస్తోంది. జాతరకు అవసరమయ్యే వస్తు సామగ్రిని తీసుకునేందుకు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పట్టణానికి రావడంతో.. ఎక్కడ చూసినా సందడి కనిపిస్తోంది.



విద్యుత్ దీపాల అలంకరణలో గంగమ్మ ప్రతిమ

ఆకర్షిస్తున్న అమ్మవారి ప్రతిమలు

జాతరను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన గంగమ్మ ప్రతిమలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనమిచ్చేలా ప్రతిమలు ఏర్పాటు చేశారు. అలాగే బలిజపల్లె గ్రామం నుంచి గుడి వరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బలిజపల్లె గంగమ్మకు తుమ్మల అగ్రహారం పుట్టినిల్లు కావడంతో.. ఆ గ్రామంలో కూడా అమ్మవారి సన్నిధి వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రధానంగా బలిజపల్లె, తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె గ్రామ ప్రజలు కలిసి జాతరను నిర్వహిస్తారు. అందువల్ల పై మూడు గ్రామాలతోపాటు పట్టణంలోని అనేక మంది ఇళ్లు బంధువులతో కళకళలాడుతున్నాయి. ఇదిలావుంటే జాతరకు వచ్చే భక్తులకు అనేక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు పట్టణంలోని అనేక ప్రాంతాలతోపాటు బలిజపల్లె పరిసర ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు, మజ్జిగ, నీళ్ళ ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

గంగమ్మ జాతర ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులందరూ సమష్టిగా పని చేయాలని అర్బన్ సీఐ నరసింహారావు తెలిపారు. బలిజపల్లె గ్రామంలో జాతరకు సంబంధించిన విధులపై పోలీసులకు సీఐ బుధవారం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారని, వారంతా అమ్మవారిని దర్శించుకోవాలన్న ఆత్రుతతో ఉంటారన్నారు. అందువల్ల భక్తులకు వీలైనంత త్వరగా అమ్మవారి దర్శనం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. క్యూలైన్‌లో తోపులాటలు లేకుండా చూడాల్సిన బాధ్యత అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది చూడాలన్నారు. అమ్మవారి గుడి వద్దకు రాగానే భక్తులు ఒకరినొకరు తోసుకునే పరిస్థితులు ఉంటాయని, గుడి వద్ద విధులు నిర్వహించే వారు ఓర్పుతో, సమన్వయంతో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించాలన్నారు. కొంత మంది ఎక్కువ సేపు అమ్మవారికి ఎదురుగా నిలుచుకొని దర్శించుకుంటుంటారని, అలాంటి వారిని సున్నితంగా ముందుకు పంపించాలన్నారు. వృద్ధులకు, వికలాంగులకు సహకరించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో జాతరలోకి వాహనాలను అనుమతించకూడదని తెలిపారు. పార్కింగ్ స్థలాల్లోనే వాహనదారులు వాహనాలను పెట్టుకునేలా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. చైన్‌స్నాచర్స్, పిక్‌పాకెటర్స్ ఉంటారని వీరిపై కూడా ఓ కన్నేసి ఉంచాలన్నారు. గంగమ్మను శుక్రవారం తెల్లవారుజామున పొలిమేర్లకు సాగనంపే వరకు పోలీసులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు.



పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ నరసింహారావు

ఈ ఉపాధ్యాయురాలు మాకొద్దు





తరగతి గదికి తాళం వేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, తరగతి గది నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

పాఠశాలకు తాళం వేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

మదనపల్లె సిటీ : 'పాఠాలు బోధించకుండా ఉన్న ఈ ఉపాధ్యాయురాలు మాకొద్దు' అంటూ విద్యార్థులను తల్లిదండ్రులు బయటకు పంపి పాఠశాలకు తాళం వేశారు. ఈ సంఘటన మండలంలోని కొండామారిపల్లె పంచాయతీ బాలాజీనగర్ ఉర్దూ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో నుజహత్ నఫీసా గణిత ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఈమె గతేడాది నుంచి పాఠాలు చెప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు గతంలో అనేక సార్లు ఆందోళనకు దిగడంతోపాటు స్పందనలో కూడా ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఉపాధ్యాయురాలిపై విచారణకు ఆదేశించారు. ఈ నెల 4న మదనపల్లె ఉప విద్యాశాఖాధికారి కృష్ణప్ప ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను విచారణ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. ఇదిలా ఉండగా ఆమె పాఠశాలకు హాజరైతే తమ పిల్లలను పంపబోమని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విచారణ నివేదిక ఉన్నతాధికారులకు పంపి ఆమెపై చర్యలు తీసుకుంటామని విచారణ అధికారి నచ్చచెప్పడంతో అప్పట్లో వివాదం సద్దుమణిగింది. బుధవారం ఆ ఉపాధ్యాయురాలు తిరిగి పాఠశాలకు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కోపోద్రిక్తులై పాఠశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను బయటకు పంపించి పాఠశాలకు తాళం వేశారు.

విచారణ నివేదిక పంపాను:

ఉపాధ్యాయురాలు నుజహత్ నఫీసా వ్యవహార తీరుపై పాఠశాలలో విచారణచేసి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించడం జరిగింది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– క్రిష్ణప్ప, డీవైఈఓ, మదనపల్లె

పూరి గుడిసె దగ్ధం

చిట్వేలి : మైలపల్లి గొల్లపల్లి దళితవాడలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో కొత్త వరలక్ష్మికి చెందిన పూరిగుడిసె దగ్ధమైంది. బాధితురాలు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాను నిద్రపోతున్న సమయంలో భయపెట్టడానికి, ఇల్లు ఖాళీ చేయించేందుకు కొంత మంది ఉద్దేశ పూర్వకంగా నిప్పు పెట్టారని ఆమె ఆరోపించారు. తన కుమారుడు కువైట్‌లో ఉన్నాడని, రెండు రోజుల క్రితం రూ. 80 వేలు పంపించాడని, కూలి డబ్బులు, బీరువా, టీవీ, బట్టలు, వంట సామగ్రి మొత్తం కాలిపోగా తాను కట్టుబట్టలతో మిగిలానని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని కోరారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, వీఆర్ఓ భుజంగరావులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించి ప్రభుత్వం ద్వారా అందాల్సిన ఆర్థిక సాయాన్ని అందిస్తామని వారు తెలిపారు.



కాలిపోయిన పూరిగుడిసె

నాటుసారాపై ఎస్ఈబీ దాడులు

మదనపల్లె : మదనపల్లె, కురబలకోట మండలాల్లో నాటుసారా తయారీ, విక్రయకేంద్రాలపై ఎస్ఈబీ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి వినియోగించే 2,600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతోపాటు 100 కిలోల నల్ల బెల్లం, 76 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 10 మందిని అరెస్ట్ చేశారు. నలుగురిపై కేసు నమోదు చేశారు. అడిషనల్ ఎస్పీ డాక్టర్.వి.బి.రాజ్‌కమల్ ఆదేశాల మేరకు ఎస్ఈబీ సీఐలు శంకరమల్లయ్య, శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు చేశారు. మదనపల్లె మండలం సీటీఎంలో విజయ(36), మల్లికార్జున(38)లను అరెస్ట్ చేసి 26 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకుని 400 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. కురబలకోట మండలం మట్లివారిపల్లె పంచాయతీ శివరామాపురం గ్రామసమీపంలోని అటవీ ప్రాంతంలో జరిపిన దాడుల్లో చినరెడ్డెప్పనాయుడు(45), సుధాకర్ నాయుడు(43), అశోక్‌నాయుడు(35), మదన్‌కుమార్‌నాయుడు(33)లను అరెస్ట్ చేసి, రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 40 లీటర్లు నాటుసారా, టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 8 డ్రమ్ముల్లోని 1,400 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు. స్వాధీనం చేసుకున్న 40 లీటర్ల నాటుసారాను కొనుగోలు చేసి అమ్మకాలు సాగించే పోతబోలు గ్రామానికి చెందిన రామచంద్ర(48), నాటుసారా తయారీకి బెల్లంను సరఫరా చేసిన గుర్రంకొండ మండలం తరిగొండకు చెందిన కిరాణావ్యాపారిపై కేసు నమోదు చేశారు. కురబలకోట మండలం మట్లివారిపల్లె పంచాయతీ గంటావారిపల్లె గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో దాడులు జరిపి అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న గంటోళ్ల నాగరాజు(48), గంటోళ్లరెడ్డెప్ప(43), చిలకవారిపల్లెకు చెందిన చంద్ర(48), సీటీఎంకు చెందిన బెల్లంవ్యాపారి కృష్ణమూర్తి(58)లను అరెస్ట్ చేశారు. రవాణాకు సిద్ధంగా ఉంచిన 10 లీటర్ల నాటుసారా, 100 కిలోల నల్లబెల్లంను టీవీఎస్ ద్విచక్రవాహనంతో సహా స్వాధీనం చేసుకున్నారు. నాలుగు డ్రమ్ముల్లోని బెల్లపుఊట 800 లీటర్లను ధ్వంసం చేశారు. స్వాధీనం చేసుకున్న 10 లీటర్ల సారాను కొనుగోలు చేసి అమ్మకాలు సాగించే సీటీఎంకు చెందిన ముదివేడు గోవిందమ్మ(55), బెల్లం సరఫరా చేసిన వ్యాపారిపై కేసు నమోదు చేశారు. మరో నిందితుడు గంటోళ్ల సూర్యనారాయణ పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు.



సీటీఎంలో సారా విక్రయిస్తున్న నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి, సిబ్బంది

భార్యపై భర్త హత్యాయత్నం

నిమ్మనపల్లె : ఇంట్లోని వస్తువులు ధ్వంసం చేసి భార్యపై భర్త కొడవలితో హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. కొండయ్యగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎ.శ్రీనివాసులు, ఎ.నిర్మల(45) భార్యాభర్తలు. వీరికి డిగ్రీ చదువుతున్న ఇద్దరు కుమార్తెలు చందన, భవ్యశ్రీ ఉన్నారు. శ్రీనివాసులు భవననిర్మాణ మేస్త్రీగా పని చేస్తుండగా, నిర్మల కూలి పనులకు వెళుతోంది. శ్రీనివాసులు మద్యానికి బానిసై తరచూ ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. ఇటీవల వారు రూ.4 లక్షల వ్యయంతో ఇంటిని ఆధునీకరించారు. మంగళవారం ఉదయం భార్యాభర్తల మధ్య తీవ్రంగా గొడవ జరిగింది. శ్రీనివాసులు ఇంట్లోకి నూతనంగా తెచ్చిన రిఫ్రిజరేటర్, టీవీలతోపాటు గ్రానైట్, టైల్స్ బండలను ధ్వంసం చేశాడు. రూ.30 వేల విలువ చేసే రెండు సెల్‌ఫోన్‌లను పగులగొట్టాడు. ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకుని రాద్ధాంతం చేయడంతో భార్య నిర్మల నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగులగొట్టి శ్రీనివాసులను బయటకు రప్పించారు. అతను పోలీసులపై సైతం తిరగబడ్డాడు. దీంతో అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మందలించి సాయంత్రం ఇంటికి పంపేశారు. రాత్రి ఇంట్లో అందరూ పడుకున్న తర్వాత.. భార్య తనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టిందన్న కోపంతో సుమారు 11 గంటల సమయంలో కొడవలితో దాడి చేశాడు. తలపై నరికాడు. చంపేందుకు ప్రయత్నించాడు. హఠాత్పరిణామం నుంచి తేరుకున్న నిర్మల కుమార్తెల సాయంతో బయటపడి నిమ్మనపల్లె పీహెచ్‌సీకి వెళ్లింది. అక్కడి నుంచి మెరుగైన వైద్యచికిత్సలకై మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు బుధవారం బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని నిందితుడిపై ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.



గాయపడిన నిర్మల

యాసిడ్ విక్రయాలను నియంత్రించాలి

మదనపల్లె : మహిళలపై యాసిడ్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో, నేరాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు అమ్మకందారులు, నిల్వదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని డీఎస్పీ కేశప్ప అన్నారు. జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు ఆదేశాల మేరకు పట్టణంలో యాసిడ్ అమ్మకందారులు, లేబొరేటరీ అధ్యాపకులు, ల్యాబ్ నిర్వాహకులతో డీఎస్పీ బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాసిడ్ తయారీదారులు, అమ్మకందారులు లాగ్ బుక్ రిజిస్టర్‌ను మెయింటైన్ చేయాలన్నారు. యాసిడ్ కొనుగోలు చేసే వారి ఆధార్, ఐడీ కార్డు రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి మాత్రమే యాసిడ్ విక్రయించాలని, కాన్సంట్రేషన్ యాసిడ్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవ్వరికీ అమ్మరాదన్నారు. యాసిడ్ ఫ్యాక్టరీలో తయారీదారులు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, కళాశాల యాజమాన్యాలు లేబొరేటరీలలో అప్రమత్తంగా ఉండాలన్నారు. యాసిడ్ తయారీదారులు, విక్రయదారులు చట్టాన్ని అతిక్రమించి ఎవరికైనా అక్రమంగా విక్రయించినట్లు తెలిస్తే వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే నింపాలని, లూజ్ క్యాన్లు, బాటిల్స్‌కు పట్టడం చేయవద్దన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎక్కడైనా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే అమ్మకందారులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, వ్యక్తిగతంగా కొందరి ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐలు మహబూబ్‌బాషా, మురళీకృష్ణ, సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ కృష్ణయ్య, టూటౌన్ ఎస్ఐ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సమక్షంలో వైఎస్‌ఆర్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె గ్రామ పంచాయతీ పరిధి మిట్టపల్లె గ్రామంలో తెలుగుదేశం పార్టీ నుంచి 120 కుటుంబాలు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మిట్టపల్లె గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలోని కె.వై.వెంకటసుబ్బయ్య, కాడే శ్రీనివాసులు, రాసాల కదిరయ్య, వెంకటరమణ, గొల్ల ప్రసాద్, కె.రమణయ్య, చిన్నయ్య, సంగటి సుబ్బయ్య, ఎం. నరసింహులు, కాడు రామ్‌ప్రసాద్ వైఎస్‌ఆర్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి పార్టీలో చేరామని వారు తెలిపారు. మండల వైఎస్‌ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాన కంతులలో

ఇన్‌కంట్యాక్స్‌కు మినహాయింపు

రాజంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఈ నెల నుంచే ఇన్‌కంట్యాక్స్ సమాన కంతులలో పెన్షన్ నుంచి మినహాయింపు కోరారని రాజంపేట తాలుకా ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య వెల్లడించారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పెన్షనర్లు వారి పెన్షన్ సంవత్సరానికి చూసుకొని, ఏ పద్ధతి ఇన్‌కంట్యాక్స్ మినహాయింపు కోరుకుంటున్నారో ట్రెజరీ అధికారులకు తెలియచేయాలని తెలిపారు. సంవత్సరానికి పెన్షన్ రూ.7 లక్షలు ఉన్న వారు కొత్తపద్ధతిలో ఇన్‌కంట్యాక్స్ మినహాయింపు కోరుకుంటే మంచిదన్నారు. యేడాది రూ.7 లక్షలు పైబడి సేవింగ్స్ ఉన్న వారికి పాత పద్ధతిలో కొంత మేరలాభం ఉంటుందన్నారు. సేవింగ్స్ లేని వారికి కొత్తపద్ధతిలో లాభముంటుందన్నారు. పెన్షనర్లు తమ పెన్షన్ సంవత్సరానికి లెక్కించుకొని పాత, కొత్త విధానాలలో ఏది లాభసాటిగా ఉంటుందో అది ఎంచుకొని సకాలంలో ట్రెజరీ అధికారులకు తెలియజేయాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే ఫోన్ నంబర్: 9989500740ను సంప్రదించాలన్నారు. సమావేశంలో కార్యదర్శి కృష్ణయ్య, కోశాధికారి చలపతి, అసోసియేట్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు గౌస్, లక్ష్మీ, నరసింహులు, సుబ్బరామయ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిల్లి పిచ్చయ్య

వీఆర్ఏలు దీక్షల్లో పాల్గొనవద్దు

కమలాపురం : జిల్లాలోని అన్ని మండలాల రెవెన్యూ కార్యాలయాల్లో పని చేస్తున్న వీఆర్ఏలందరూ ఈ నెల 20, 21వ తేదీల్లో జరిగే దీక్షల్లో పాల్గొనవద్దని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శేషయ్య తెలిపారు. బుధవారం ఆయన కమలాపురంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామ రెవెన్యూ సహాయకుల కొన్ని సంఘాలు ఈ నెల 20, 21వ తేదీల్లో మండల కేంద్రాల్లో దీక్షలు నిర్వహించాలని పిలుపునిచ్చాయన్నారు. అయితే ఏపీ రెవెన్యూ చైర్మన్ ఏఎస్ దివాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు ఓ.ధైర్యం ఆదేశాల మేరకు దీక్షలు చేపట్టరాదని నిర్ణయించారన్నారు. ఆ మేరకు ప్రతి మండలంలో గ్రామ రెవెన్యూ సహాయకులు దీక్షల్లో పాల్గొనవద్దని ఆయన పేర్కొన్నారు. మన నూతన సంఘం ఏర్పడిన తక్షణం వీఆర్ఏకు ముఖ ఆధారిత హాజరు మినహాయించడం జరిగిందని గుర్తు చేశారు. అలాగే ప్రమోషన్లు, డీఏలకు సంబంధించిన ఫైళ్లు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. గత నెల 27వ తేదీన అన్ని సంఘాల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులతో సీసీఎల్ఏ కమిషనర్ వీఆర్ఏల సమస్యలపై చర్చించారని అన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని 20, 21వ తేదీల్లో జరిగే దీక్షల్లో వీఆర్ఏలు ఎవరూ పాల్గొనవద్దని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నాగేష్, ఇబ్రహీం, అబ్బాస్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని కర్మలవారిపల్లె గ్రామ పరిధిలో ఉన్న ఒక పాత గొడౌనులో అక్రమంగా నిల్వ ఉంచిన 110 బస్తాల (5510 కేజీల) బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇదురు బాష, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వరద కిషోర్‌రెడ్డి, మైలవరం డీటీ రూపేష మునిరావు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. నిల్వ ఉంచిన 110 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కె.చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకొని మైలవరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు డిప్యూటీ తహసీల్దార్ రూపేష్ మునిరావు తెలిపారు.

తండ్రిని పొడిచిన కుమారుడి అరెస్ట్

పోరుమామిళ్ల : పట్టణంలోని బలిజకోట వీధికి చెందిన నంద్యాల రామయ్య(65)ను ఈనెల 17న కత్తితో పొడిచిన ఆయన కుమారుడు లక్ష్మీనరసయ్య(35)ను బుధవారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి మార్కాపురం వద్ద అరెస్ట్ చేశారు. అతన్ని బద్వేలు కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి చెప్పారు.

డీసీసీ బ్యాంకులో డిపాజిట్లకు అధిక వడ్డీ



బోర్డు సమావేశంలో పాల్గొన్న ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్, డైరెక్టర్లు

కడప అగ్రికల్చర్ : ప్రాథమిక వ్యవసాయ సంఘాలు డీసీసీ బ్యాంకులో జమ చేయు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఒక శాతం అధిక వడ్డీ ఇవ్వనున్నట్లు ఆప్కాబ్, డీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. బుధవారం కడపలోని డీసీసీ బ్యాంకులో బ్యాంకు బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపాజిట్‌పై ఇచ్చే లోన్లకు 1 శాతం తక్కువ వడ్డీ తీసుకునుటకు నిర్ణయించినట్లు తెలిపారు. సొసైటీ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా కోసం కడప డీసీసీ బ్యాంకు ఖర్చుతో ఈ సంవత్సరం పాలసీ తీసుకోవడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. అందుకు సుమారు రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేయడం జరిగిందన్నారు. అనంతరం నిర్వహించిన డీఎల్ఈసీ సమావేశంలో హెచ్ఆర్ పాలసీ ప్రకారం కడప, అన్నమయ్య జిల్లాల్లోని డీసీసీ బ్యాంకుకు అనుసంధానంగా ఉన్న సొసైటీ సిబ్బందికి కొత్త జీతాలు జూలై 2023 నుంచి అమలు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్లు వెంకటసుబ్బారెడ్డి, ఆంజనేయులు, రాజామణి, షేక్ హుస్సేన్‌పీరా, గంగాద్రి, వీరారెడ్డి, సురేష్, డీసీఓ సుభాషిణి, నాబార్డు డీడీఎం విజయవిహారి తదితరులు పాల్గొన్నారు.